క్లుప్తంగా

ఉపాధి పనులు కల్పించాలి


ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం:పని అడిగిన ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించాలని అంబుడ్స్ పర్సన్ అధికారి డాక్టర్ సురేంద్రకుమార్ సూచించారు. శనివారం ఏపీడీ సాంబశివరావుతో కలిసి స్థానిక ఉపాధి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయం వద్ద ఉన్న ఫిర్యాదుల బాక్స్‌ను పరిశీలించారు. అనంతరం ఉపాధి సిబ్బంది, ఉద్యాన పంటల రైతులు, ఉపాధి కూలీలతో మాట్లాడారు. అలాగే గ్రామ సమీపంలో సాగైన ఉద్యాన పంటలను, అందులో వేసిన అంతర పంటలను పరిశీలించారు. ఈసీ సుబ్బన్న, టెక్నికల్ అసిస్టెంట్లు రామచంద్రారెడ్డి, గణమద్దిలేటి, రమేష్‌బాబు, కరీముల్లా,హరిబాబు ఉన్నారు.

కళాశాలలో ఆర్‌ఐఓ విచారణ


విద్యార్థులను విచారిస్తున్న ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నలంద జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం ఆర్ఐఓ గురువయ్య శెట్టి విద్యార్థులతో విచారణ చేపట్టారు. విద్యార్థులకు యాజమాన్యం ట్రిమ్మింగ్ చేయించారని, విద్యార్థిని కట్టెతో కొట్టడంతో చేయి విరిగిందని విద్యార్థి సంఘాలు చేపడుతున్న ఆందోళనను దృష్టిలో పెట్టుకొని కళాశాలలో యాజమాన్యం, విద్యార్థులతో విచారణ చేసినట్లు ఆర్ఐఓ తెలిపారు. తల్లిదండ్రుల మాట ప్రకారమే హాస్టల్‌లో ట్రిమ్మింగ్ చేయించుకున్నామని, తోపులాటలో డోరు గట్టిగా తగలడంతో చేయి విరిగిందని విద్యార్థులు వివరించారన్నారు. డీఐఈఓ సునీత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రధర్‌రెడ్డి, పోలయ్య ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణం క్షేమం, లాభదాయకం


లక్కీ డిప్ విజేతకు బహుమతి అందజేస్తున్న నంద్యాల డిపో మేనేజర్

నంద్యాల టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం ద్వారా క్షేమంగా గమ్య స్థానాలకు చేరడమే కాకుండా ఆర్టీసీ ప్రవేశ పెట్టె వినూత్న స్కీమ్‌లలో పాల్గొని లాభదాయకంగా మార్చుకోవచ్చని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నంద్యాల - రుద్రవరం మార్గంలో తిరుగుతున్న 6 బస్సుల్లో నవంబరు 1 నుంచి 30వ తేదీ వరకు ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం విజేతలను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. శిరివెళ్ల గ్రామానికి చెందిన నాగన్నకు మొదటి బహుమతి, రుద్రవరం గ్రామానికి చెందిన సాంబయ్యకు రెండో బహుమతి, శిరివెళ్ల గ్రామానికి చెందిన అవంతికి మూడో బహుమతి దక్కిందని చెప్పారు. గెలుపొందిన వారు అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)ను సంప్రదించాలని సూచించారు.అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, స్టేషన్ మేనేజర్ తిమ్మయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరమ్మకు పూజలు


ఇసుక గౌరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ కల్యాణ మండపంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శ్రీ బాలాజీ మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం ఇసుకతో తయారు చేసిన గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన గౌరమ్మలను భీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో నిమజ్జనం చేస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, సునీత, లక్ష్మణ్ కోరారు. శనివారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు,హెల్పర్లు అనేక సేవలు అందిస్తున్నా ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు.

లో ఓల్టేజీ నివారణకు చర్యలు

రుద్రవరం: మండలంలోని చిత్రేనిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు లో ఓల్టేజీ సమస్య లేకుండా నివారణకు చర్యలు తీసుకున్నట్లు ఏ డీఈఈ రవికాంత్ చౌదరి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో శనివారం కెపాసిటర్ బ్యాంకు చార్జి చేశారు. ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో బోరు మోటార్లు అధికంగా ఉన్నాయన్నారు. వారికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న సురేఖ, సుప్రజ ఇద్దరూ అక్కాచెల్లెల్లు. దొర్నిపాడులోని వెంకట సుబ్బయ్య, వసంతలక్ష్మిదేవి కుమార్తెలు. ప్రభుత్వం మొదట సువర్ణకు మాత్రమే దివ్యాంగ పింఛన్ ఇచ్చేది. వైఎస్సార్‌సీపీ వచ్చాక ఇద్దరికీ రూ.3వేల చొప్పున అందజేస్తుంది. వీరిలో ఒకరు పదవ తరగతి పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుండగా, సుప్రజ ఎనిమిదో తరగతి చదువుతోంది. పింఛన్ మా కుటుంబానికి ఎంతో ఆసరాగా మారిందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



ఈ వృద్ధ దివ్యాంగురాలి పేరు రామక్క. దొర్నిపాడులో నివాసముంటుంది. ఈమెకు ప్రతి నెలా దివ్యాంగుల పింఛన్ సొమ్మును వలంటీర్ వెంకటపుల్లయ్య ఇంటివద్దకే వెళ్లి అందజేస్తున్నాడు. గతంలో పింఛన్ సొమ్ము కోసం కార్యాలయాల చుట్టూ తిరగలేక ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు వలంటీర్ ఇంటికి వచ్చి నిద్రలేపి ఆ సొమ్ము ఇస్తున్నాడని సంతోషంగా చెబుతోంది.



ఈయన పేరు దస్తగిరి. మండల కేంద్రం దొర్నిపాడు వాసి. పెళ్లికి ముందు ఓ రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడు. కృత్రి కాలు ఏర్పాటు చేసుకొని ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఆసియా అనే కూతురు.. పుట్టుకతోనే మానసిక దివ్యాంగురాలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తండ్రితో పాటు కుమార్తెకు దివ్యాంగ పింఛన్ అందుతుంది. ఇద్దరికీ పింఛన్ సొమ్ము అందుతుండటంతో కుటుంబానికి అండగా మారిందని చెబుతున్నాడు.



ఈ తల్లీ కొడుకులు డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. తల్లి లక్ష్మిదేవి ప్రస్తుతం వితంతు పింఛన్ పొందుతుంది. కుమారుడు చెన్నకేశాలు పదేళ్ల క్రితం రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. గతంలో పింఛన్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా తిరస్కరించారు. దీంతో తమ బతుకులింతేననుకున్నారు. జగనన్న వచ్చాక దరఖాస్తు చేయడంతో 2021 నుంచి రూ.3వేల పింఛన్ పొందుతున్నాడు. దీంతో తమ జీవనానికి ఇబ్బందులు తప్పాయంటున్నారు.

దివ్యమైన కానుక...వారింట వేడుక

- దివ్యాంగులకు అండగా 'వైఎస్సార్ పింఛన్ కానుక'
- ఒకే కుటుంబంలో ఇద్దరు దివ్యాంగులకు పింఛన్లు..
- జిల్లాలో దివ్యాంగుల పింఛన్లు - 26,021
- ప్రతి నెల విడుదలవుతున్న నగదు రూ.7,80,83,000

దొర్నిపాడు: వారంతా విధి ఆడిన వింతనాటకంలో ఓడిపోయారు. దివ్యాంగులుగా,మానసిక వైకల్యంతో సంతోషాలకు దూర మయ్యారు. కానీ ఆత్మ స్థైర్యంతో స్వయం ఉపాధితో పాటు ప్రభుత్వం అందించే పింఛన్‌తో జీవనం గడుపుతున్నారు. గతంలో కుటుంబంలోని ఒక్క దివ్యాంగుడికి మాత్రమే పింఛన్ మంజూరు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సదరం సర్టిఫికెట్ ఉన్న ఇద్దరు అంగవైకల్యం ఉన్న వారికి ఇస్తున్నారు. అలాగే ఇంట్లో ఒకరికి ఏ రకం పింఛన్ వస్తున్నా మరొకరికి దివ్యాంగ పింఛన్ ఇస్తున్నారు. ఆ సొమ్ముతోనే వారు జీవనం సాగిస్తున్నారు.

జిల్లాలో పింఛన్ల వివరాలు ..

జిల్లాలో దివ్యాంగుల పింఛన్లు 26,021 ఉండగా వీరికి ప్రతి నెలా రూ.7,80,83,000 ఖర్చు చేస్తుంది. వీరందరికీ ఆయా సచివాలయల్లో పనిచేసే వేల్ఫేర్ అసిస్టెంట్లు నగదును తీసుకొచ్చి వలంటీర్లకు అందజేసి సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూస్తున్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు



అర్హతే ప్రామాణికంగా పింఛన్లను అందజేస్తున్నాం. ఒకే ఇంట్లో ఇద్దరు దివ్యాంగులు ఉన్నా లేదా వృద్ధాప్య పింఛన్ వస్తున్నా మరొకరు దివ్యాంగులై ఉంటే రెండు పింఛన్లు ఇచ్చే అవకాశం ఉంది. సదరం సర్టిఫికెట్ తప్పని సరిగా ఉండాలి. అర్హులు సచివాలయల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

– పీవీ.సుబ్బారెడ్డి, ఎంపీడీఓ, దొర్నిపాడు

జలవివాదానికి కేంద్రమే కారణం

నంద్యాల (సెంట్రల్): నాగార్జునసాగర్ విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. సమితి సభ్యులతో శనివారం ఆయన మాట్లాడుతూ..రాజకీయ స్వార్థం కోసం తెలుగు రాష్ట్రాల మధ్య బీజేపీ ప్రభుత్వం చిచ్చుపెడుతోందని విమర్శించారు. కృష్ణా జలాల పునః పంపిణీ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఇటీవల తెచ్చిన చీకటి చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా బడిలో ఉండాలి

చాగలమర్రి: 5–18 ఏళ్ల విద్యార్థులందరూ విద్యా సంస్థల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా సూచించారు. శనివారం మండలంలోని స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, సచివాలయాల వెల్ఫేర్ ఆఫీస్లతో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. పనిలో ఉంచుకున్న యజమానులపై చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. అలాగే గ్రాస్ ఎన్‌రోల్‌మేంట్ రేషియో కార్యక్రమం నిర్వహణపై ఈ నెల 11న జిల్లా అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రామాన్ని వంద శాతం పూర్తి చేయాలని కోరారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


నర్సాపురంలో సంక్షేమ లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: ప్రజా శేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నర్సాపురం,తిప్పారెడ్డిపల్లె గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఆయా కాలనీల్లో ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ప్రజలకు బుక్ లెట్ అందజేసి పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు..సచివాలయ పరిధిలోని 1,101 కుటుంబాలకు రూ. 22.18 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు. నర్సాపురం సచివాలయంతో మండలంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముగిసింది. నాలుగున్నరేళ్లలో ఇచ్చిన హామీలు పూర్తి చేసి, సమస్యలు తెలుసుకునేందుకు ప్రజల్లోకి వచ్చామన్నారు.తహసీల్దారు రవీంద్ర ప్రసాదు,ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఏపీఎం కల్పలత, ఏఈలు రాఘవేంద్రారెడ్డి, వెంకటరాముడు, ప్రమోద్, ఏపీఓ ప్రతాప్,వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, జెడ్పీటీసీ మాధవి, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ కిరణ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాదరెడ్డి, నాయకులు శుద్దుల కృష్ణుడు, నాగరాజు, మంగళి అబ్బి, బాలిరెడ్డి, మాధవ, జయరాముడు,బద్రినారాయణ, గుండా నరసింహయ్య, రమణారెడ్డి, దేవగుడి జాకీర్, ఓబన్న,నాగేశ్వరరావు,శంకర్ ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో నమోదు చేయించండి

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మండలంలో అధిక సంఖ్యలో క్రీడల్లో పాల్గొనేలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా లోగో, మస్కట్ బ్రోచర్లను వెల్ఫేర్ అసిస్టెంట్లకు అందజేశారు. వారు మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే వారికి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు.

హామీల అమలుపై అవగాహన

చాగలమర్రి: స్థానిక 3వ సచివాలయ పరిధిలోని 11వ వార్డు, ఎస్టీ కాలనీలో వార్డు సభ్యుడు, ఇన్‌చార్జ్ మాబుసున్న ఆధ్వర్యంలో శనివారం పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేసి, ఆయన నెరవేర్చిన హామీలను వివరించారు. సచివాలయ కన్వీనర్లు ఖాశీంపీరా, బబ్లూషోయబ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె రహదారిలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి,రుద్రవరం సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గుట్టకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆయా ఆలయాల్లో అర్చకులు స్వామి అమ్మవార్లకు నిత్యపూజలు గావించి అభిషేకించి పట్టు వస్త్రాలు,పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గుట్టకొండ ఆలయానికి నెల క్రితం మైదుకూరుకు చెందిన ఓ భక్తుడు పంచ లోహాలతో చేయించిన చెంచులక్ష్మి,నరసింహ్మాస్వామి ఉత్సవమూర్తుల విగ్రహాలను అందించారు. ఆ విగ్రహాలకు అభిషేక పూజలు చేయించారు.

నేటి నుంచి 'వికసిత్ భారత్'

దొర్నిపాడు: మండలంలో ఆదివారం నుంచి భారత్ వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. 3న గుండుపాపల, 12న క్రిష్టిపాడు, 13న డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె, 14న చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, 15న దొర్నిపాడు, రామచంద్రాపురం, 16న కొండాపురం, అమ్మిరెడ్డినగరం, 17న అర్జునాపురం పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

4నుంచి విధుల బహిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): ఏపీ భూ హక్కు ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఈనెల 4వ తేదీ నుంచి న్యాయవాదుల విధులను బహిష్కరిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గోళ్ల జయకృష్ణ, ప్రతాపరెడ్డి తెలిపారు. శనివారం బార్ కార్యాలయంలో వారు మాట్లాడారు.

త్రిసభ్య కమిటీతో విచారణ చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): నలంద కళాశాలపై విచారణ సక్రమంగా చేయలేదని, త్రిసభ్య కమిటీ వేసి విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, తదితర సంఘాల నాయకులు ధనుంజయుడు, రాజునాయుడు, రఫీ, రియాజ్, నవీన్, రాంబాబు, శివ కోరారు. శనివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.

జయప్రదం చేయండి

ఈనెల 15, 16, 17 తేదీల్లో నెల్లూరులో జరిగే పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రఫీ కోరారు. శనివారం పట్టణంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మహాసభల్లో ఆంధ్రప్రదేశ్ మాజీ హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు.

ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించండి


ఆరోగ్యశ్రీ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

గోస్పాడు: ప్రతి ఒక్కరి ఫోన్లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హైస్కూల్ కొట్టాల గ్రామాన్ని సందర్శించి ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన కల్పించేందుకు, ఆసుపత్రిలో వివరాలు తెలిసేలా ఆరోగ్యశ్రీ యాప్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. అలాగే ఆరోగ్య ఆసరా పథకం కింద ఇచ్చే ఆర్థిక సహాయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా వేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సూచించారు. హైస్కూల్ కొట్టాల గ్రామంలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతరావునాయక్, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి సునీత, ఎంసీహెచ్ జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రసన్న పాల్గొన్నారు.

భూముల పరిశీలన


రైతులతో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ, హైవే ఈఈ

చాగలమర్రి: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి గోపల్లే, మల్లేవేముల మీదుగా రూ.1100 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 440 నంబరు జాతీయ రహదారిలో చాగలమర్రిలోని మల్లేవేముల రస్తా వద్ద భూములు కోల్పోతున్న రైతుల అభ్యంతరాల మేరకు శనివారం హైవే ఈఈ విజయభాస్కరరెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఈఈ మాట్లాడుతూ రైతులు ఇప్పటికే రెండు సార్లు నంద్యాల ఆర్‌డీఓ, హైవే అథారిటీ అధికారులకు అభ్యంతరాలు తెలియజేయడంతో పరిశీలించామన్నారు. రహదారి నిర్మాణానికి అలైన్‌మెంట్ అప్రూవల్ పూర్తి చేశారని, ఇప్పుడు మార్పులు చేసే అధికారం తమ పరిధిలో లేదన్నారు. రైతుల వినతులను ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం మార్కెట్ విలువ కంటే రెండున్నర రెట్లు ఎక్కువగా పరిహారం అందజేస్తుందన్నారు. హైవే ఏఈ సురేంద్రారెడ్డి, తహసీల్దార్ సుభద్రమ్మ, డీటీ శ్రీనివాసరెడ్డి, సర్వేయర్ మద్దిలేటి పాల్గొన్నారు.

కేసీ కెనాల్ ఇంజినీర్లకు సన్మానం


ఇంజినీర్లను సన్మానిస్తున్న రైతులు

నంద్యాల(సెంట్రల్): కేసీ ఆయకట్టు పరిధిలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రణాళిక ప్రకారం నీరు అందించి పంటలను ఆదుకోవడం ప్రశంసనీయమని గడివేముల మండలం గడిగరేవుల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు పట్టణంలోని కేసీ ప్రధాన కాలువ కార్యాలయంలో కార్యనిర్వాహక ఇంజినీరు తిరుమలేశ్వర్ రెడ్డి, ఉప ఇంజనీరు సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏఈలు విజయ్‌కుమార్, రాధాకృష్ణను సన్మానించారు. బెట్టపోయిన జొన్న, మినుము పంటలకు ప్రణాళిక ప్రకారం నీరు విడుదల చేసి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు రామనాథరెడ్డి, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ఆదరించండి


మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తూ, పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనను మరోమారు ఆదరించాలని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 22వ వార్డు క్రాంతినగర్‌లో కౌన్సిలర్ నేలటూరి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రజల అడిగి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నీసా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి, మల్లికార్జున, మణిమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, రామిరెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, సుభాన్, మున్నా, జాకీర్‌హుసేన్, రహంతుల్లా, గన్ని కరీం పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో నమోదుపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఈఆర్ సర్వేపై త్వరలో కేంద్ర బృందం వెరిఫికేషన్ ఉన్న నేపథ్యంలో ముందస్తు సర్వేపై (పీఆర్ఈ సర్వే) జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆధికారులుగా నియమించామన్నారు. ప్రతి మండల స్పెషల్ అధికారి తమ పరిధిలోని బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు 30 గృహాలను ర్యాండమ్ తనిఖీ చేసి సూచించిన ప్రొఫార్మాలో పొందుపరిచి నివేదిక ఇవ్వాలని సూచించారు. నంద్యాల, డోన్, ఆత్మకూరు తదితర వలసబుల్ ప్రాంతాల్లో అధిక మంది విద్యార్థులు డ్రాపవుట్స్ ఉన్నట్లు తెలుస్తోందని, అధికారులు వెంటనే స్పందించాలని చెప్పారు. ఎంపీడీఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంల బృందాలు వలంటీర్లను అనుసంధానం చేసుకొని పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, భూగర్భజల శాఖ డీడీ రఘురాం, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గడువులోపు గృహాలను సిద్ధం చేస్తాం


టిడ్కో గృహాల సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ, మున్సిపల్ కమిషనర్

నంద్యాల(సిటీ): టిడ్కో గృహ సముదాయాలను గడువులోపు పెండింగ్ పనులను పూర్తి చేసి మున్సిపాలిటీకి అప్పగిస్తామని టిడ్కో (ఎస్ఈ) సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం పట్టణ శివారులో అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న టిడ్కో గృహాలను మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో గృహాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, రోడ్లు, విద్యుత్, నీరు తదితర వసతులతో పాటు ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇది వరకే ఎస్సార్పీసీలో సుమారుగా 2వేలకు పైగా గృహాలను లబ్ధిదారులకు అందించామన్నారు. మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, ఏసీపీ నరసింహమూర్తి, టిడ్కో డీఈ పవన్, ఏఈ వెంకటనాయక్, మెప్మా సీఎంఎం విజయభాస్కరరెడ్డి ఉన్నారు.

పారదర్శకంగా వ్యవహరించాలి


చాగలమర్రిలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డీఓ

చాగలమర్రి: నూతన ఓటర్ల నమోదు, తొలగింపు, పేర్లు, అడ్రస్‌ల మార్పు చేర్పులు పారదర్శకంగా నిర్వహించాలని ఆర్‌డీఓ శ్రీనివాస్ బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం మండలంలో ఏర్పాటు చేసిన 52 ఓటర్ల నమోనదు కేంద్రాలను పరిశీలించారు. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. డీటీలు యాసిన్, శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓలు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, హెచ్‌ఎం విజయలక్ష్మి ఉన్నారు.


ఉయ్యాలవాడలో ఓటు నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌ఓలు

ఓటరు నమోదుకు 70 దరఖాస్తులు

ఉయ్యాలవాడ : మండలంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదుకు యువతీ, యువకుల నుంచి 70 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫారం–6 ద్వారా పురుషులు 33, మహిళలు 34, ఫారం–8 ద్వారా పురుషులు 1, మహిళలు 2 దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు.

'మిచాంగ్'తో రైతుల్లో అలజడి

- జిల్లాలో ప్రారంభమైన ఖరీఫ్ వరి కోతలు
- తుపాన్ హెచ్చరికలతో ఆందోళన

గోస్పాడు: మిచాంగ్ తుపాను హెచ్చరికలతో రైతుల్లో గుబులు రేకెత్తుతుంది. ఖరీఫ్‌లో రికార్డు స్థాయి దిగుబడి రావడం, ధాన్యం ఎండబెట్టేందుకు అనువైన వాతావరణం, ధాన్యాన్ని ప్రభుత్వం వేగంగా కొనుగోలు చేయడం, ధాన్యం సొమ్ము గడువుకు ముందే రైతుల ఖాతాల్లో జమ చేయడం ఇలా అన్నీ సానుకూలంగా ఉన్న సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందనే వార్తల నేపథ్యంలో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తుపాను ప్రభావంతో శనివారం సాయంత్రం మేఘాలు కమ్ముకున్నాయి.

అధిక దిగుబడులు...

జిల్లాలో ఖరీఫ్‌లో భాగంగా 41,526 హెక్టార్లలో వరి పంట సాగైంది. ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాలను బట్టి బట్టి 34 బస్తాలు (75 కేజీలు) నుంచి 48 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే కురిసినా వాతావరణం అనుకూలించడంతో పాటు చీడపీడలు తక్కువగా ఉండటంతో దిగుబడి పెరిగింది.


కానాలలో ఆరబోసిన ధాన్యంపై పట్టలు కప్పి ఉంచిన దృశ్యం

సాగు ఆలస్యమైన చోట్ల పూర్తికాని కోతలు..

వర్షాల కారణంగా కొన్ని చోట్ల పంట సాగు ఆలస్యమైంది. దీంతో కోత సమయం మరిన్ని రోజులు ఉండనుండటం, తుపాన్ ప్రభావంపై హెచ్చరికలతో పంటలు నేలవాలే అవకాశముందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నూర్పిడి పూర్తి చేసుకొని బహిరంగ ప్రదేశాల్లో ఆరబోసుకున్న వారు కుప్పలు చేసుకుని పట్టలు కప్పి ఉంచుతుండగా మరి కొందరు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా కోతల త్వరగా పూర్తి చేయాలని, ధాన్యాన్ని తరలించాలని అధికారులు సూచిస్తుండటంతో కూలీలకు డిమాండ్ నెలకొంది. దీంతో అధిక మొత్తం కూలి చెల్లించాల్సి వస్తుంది పలువురు రైతులు వాపోతున్నారు.


కోత దశలో ఉన్న పైరు

కోతలు ఆలస్యం చేయాలి

వరికోతలు చేపట్టిన వారు కొంత ఆలస్యం చేయడం మంచిది. కోతలు పూర్తియన వారు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకోవడానికి గోడౌన్లలో భద్ర పరుచుకోవాలి. వాతావరణం అనుకూలించే వరకు నూర్పిడి పనులు చేపట్టొద్దు.

– మోహన్‌రావు జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల